



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 289 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 06-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది

## రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ

- వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు
- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- విపక్షాల నిరసనుల...నినాదాలు..చివరకు వాకౌట్

**న్యూఢిల్లీ,**

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ

-మిగతా 2 లో






## అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

- ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్
- తొలుత ఢిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు
- ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చు
- రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలు
- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా

**న్యూఢిల్లీ**

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత ఢిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు

-మిగతా 2 లో

# ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

## ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది




- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బిఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బిజెపి అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బిజెపికి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు

**కరీంనగర్,**

ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు.

-మిగతా 2 లో







## గ్యారంటీ స్కీంలు నిల్.. స్కాంలు ఫుల్

- 12 నెలల్లో 12 స్కాంలకు పాల్పడారు
- నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు కాని స్కాం క్యాలెండర్ మాత్రం ఇచ్చారు
- నెలనెలా ఉద్యోగాలు ఇస్తా.. జాబ్ క్యాలెండర్ తెస్తానని నిరుద్యోగులను నమ్మించి ఓట్లు పొందారు
- రేవంత్ రెడ్డి స్కామ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన హరీష్ రావు


**హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తీరుపై మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు . నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు కాని స్కాం క్యాలెండర్ మాత్రం ఇచ్చారని ఆరోపించారు. గ్యారంటీ స్కీం లు నిల్..స్కాంలు ఫుల్ అంటూ ఆరోపించారు. 12 నెలల్లో 12 స్కాంలకు పాల్పడారని విమర్శించారు. నెలనెలా ఉద్యోగాలు ఇస్తా.. జాబ్ క్యాలెండర్ తెస్తానని నిరుద్యోగులను నమ్మించి ఓట్లు పొందారని ఆరోపించారు.

-మిగతా 2 లో

## భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు

- ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదు



2 లో



## ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి

- నీటి సంరక్షణ మన అందరి బాధ్యత
- సమర్థంగా నీటిని వినియోగిస్తే కరువు రాదు
- సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో చంద్రబాబు

**అమరావతి**

ప్రతి ఎకరాకు నీరిచ్చేలా నీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రత అందరికీ కావాలి.. కానీ, సంరక్షణను చాలా మంది పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలోని 40 జీవనదుల నీటిని సమర్థంగా నియోగించుకుంటే కరవు అనేదే ఉండదని చెప్పారు. అమరావతిలో జరిగిన నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో సీఎం మాట్లాడారు. పరుగెత్తే నీటిని నిలపండి, నడిచే నీటిని జలాశయంగా మార్చండి.. భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడాలని తెలిపారు. రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను రైతు సానుకూలప్రదేశ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. సాగునీటి సంఘాలకే నామినేషన్ కింద పనులు ఇస్తున్నందున.. ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా పనిచేయాలని సూచించారు. నీటి సంఘాల పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులకు కూడా చెల్లింపులు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. నీటి పన్నులు కూడా వసూలు చేసుకుని సమర్థంగా కాలువల నిర్వహణ చేసుకోవచ్చని వెల్లడించారు. 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించామని గుర్తు చేశారు. సరైన సమయానికే రబీ, ఖరీఫ్ సాగు కోసం నీరు ఇచ్చేలా ప్రణాళిక చేద్దామని పిలుపునిచ్చారు.

-మిగతా 2 లో

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

- సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం



2 లో

# బీజేపీని గెలిపిస్తే దండిగా నిధులు


## మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులే

- గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసింది
- మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తా
- ప్రచారంలో హామీలు గుప్పించిన బండి

**కరీంనగర్,**

: మున్సిపాలిటీల్లో బిజెపిని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు.

-మిగతా 2 లో



## పన్నెండేళ్లుగా తెలంగాణాలో

# బానిస ప్రభుత్వాలు



- పదేళ్ల బిఆర్ఎస్,రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరింగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం..భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేవంత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్,**

తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం

-మిగతా 2 లో

# మణిపూర్ బీజేపీ సర్కార్‌కు తొలిరోజే నిరసన సెగ

- డిప్యూటీ సీఎం కిప్‌జెన్‌పై కుకీల ఆగ్రహం
- నేడు బంద్‌కు కుకీ గ్రూపుల పిలుపు

**ఇంఫాల్,**

మణిపూర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి తొలిరోజే నిరసన సెగ తగిలింది. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నెంచా కిప్‌జెన్‌కు వ్యతిరేకంగా కుకీ గ్రూపులు శుక్రవారం మణిపూర్ బంద్‌కు పిలుపునిచ్చాయి. కుకీ-జో తెగకు చెందిన సభ్యులు బుధవారం సాయంత్రం ఢిల్లీలోని మణిపూర్ భవన్ ఎదుట నిరసన తెలిపారు. కుకీ తెగకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్ పాటిస్తున్నట్లు జాయింట్ ఫోరమ్ ఆఫ్ సెవన్(జెఎఫ్7) ప్రకటించాయి.తమ సమిష్టి నిర్ణయానికి వ్యతిరేకంగా కుకీ తెగకు చెందిన ఏ ఎమ్మెల్యే అయినా ప్రభుత్వంలో చేరితే జరిగే పర్యవసనాలకు తమ సంస్థ బాధ్యత తీసుకోదని కుకీ-జో కౌన్సిల్ హెచ్చరించింది. ప్రభుత్వంలో చేరవద్దని తమ ఎమ్మెల్యేలను కొన్ని కుకీ గ్రూపులు కూడా హెచ్చరించాయి. ముఖ్యమంత్రిగా వై ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉప ముఖ్యమంత్రిగా కుకీ తెగ నుంచి నెంచా కిప్‌జెన్ నియమితులు

-మిగతా 2 లో



## అందుబాటులోకి
# భారత్ ట్యాక్సీ




మొదటి తరువాయి

కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. ఢిల్లీ–ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

## గ్యారంటీ స్కీంలు నిల్..
# స్కాంలు ఫుల్


మొదటి తరువాయి

జనవరిలో సివిల్ సప్లై స్కాం, ఫిబ్రవరిలో ఎన్‌టీపీసీ ఫ్లైయాస్ స్కాం , మార్చిలో స్కాండ్ స్కాం, ఏప్రిల్‌లో ఆర్టీసీ కాంట్రాక్టర్ల స్కాం, మేలో బామ్మర్థికిచ్చిన అమృత్ టెండర్లలో , జూన్‌లో ఫోర్త్ సిటీ, జులైలో లగచర్ల సెంట్రల్ వర్సిటీ, ఆగస్టులో పీజీ మెడికల్ సీట్ల స్కాం, సెప్టెంబర్‌లో 5లక్షల కోట్ల హిల్ టీపీ ఇండ్రస్టియల్ భూములు , అక్టోబర్‌లో పవర్ , నవంబర్‌లో సింగరేణి , డిసెంబర్‌లో కేఎల్ఎస్ఆర్ స్కాంలకు పాల్పడ్డారని ఆరోపించారు. రైతుల గురించి ముఖ్యమంత్రి ఒక్కదు నాడుకూడా మాట్లాడలేదని విమర్శించారు. గురుకులాల్లో పాముకాటులతో, కల్తీ ఆహారంతో పిల్లల ప్రాణాలు పోతుంటే రేవంత్ రెడ్డి మాట్లాడిందా? అంటూ ప్రశ్నించారు. 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసు కూడా ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా కేసీఆర్‌పై మీద మాత్రం బూతులు మాట్లాడుతాడని ఎద్దేవా చేశారు.

## భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు

ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదు

మాస్కో:



ఏ దేశం నుంచి అయినా భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు అని రష్యా పేర్కొన్నది. చమురు, ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదని క్రెమ్లిన్ వెల్లడించింది. భారత్‌కు కేవలం రష్యా మాత్రమే ఇంధనాన్ని సరఫరా చేయడం లేదని, ఇతర దేశాల నుంచి కూడా చమురును భారత్ కొనుగోలు చేస్తోందని, దీంట్లో కొత్తగా మేం ఏం చేసేది లేదని రష్యా ప్రతినిధి దిమిత్ర పీస్కోవ్ తెలిపారు. రష్యా నుంచి ఇంధనం కొనుగోలును ఆపేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని, రష్యాకు బదులుగా ఇక నుంచి వెనిజులా నుంచి భారత్ ఆయిల్‌ను కొంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా ప్రతినిధి పెస్కోవ్ స్పందిస్తూ .. తమ నుంచి ఇంధనం కొనుగోలు ఆపేస్తున్నట్లు ఇండియా నుంచి ఎటువంటి ప్రకటన రాలేదన్నారు.

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

హైదరాబాద్,



: గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

## మణిపూర్ బీజేపీ సర్కార్‌కు తొలిరోజే నిరసన సెగ

మొదటి తరువాయి

కావడంతో బుధవారం కంగ్‌పోక్పీ జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ నిరసనకారులు లీమాఖోంగ్ సమీపంలో రోడ్లను అడ్డగించి టైర్లను కాల్చారు.

# ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది

మొదటి తరువాయి



అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నతపదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు.

తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷–లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

మొదటి తరువాయి

ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి.పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్దాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## పన్నెండేళ్లుగా తెలంగాణాలో బానిస ప్రభుత్వాలు

మొదటి తరువాయి

అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్టాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## బీజేపీని గెలిపిస్తే దండిగా నిధులు

మొదటి తరువాయి

హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

## ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి

మొదటి తరువాయి



వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. తద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నీటి వినియోగదారుల సంఘాలు కూడా వివిధ బాధ్యతలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు పెంచే బాధ్యతతో పాటు కాలువలు, ప్రాజెక్టుల ద్వారా నీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా చింతకుంట విజయరమణ రావు ప్రచారం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి మున్సిపాలిటీ 23వ మరియు 4వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం జరిగింది.
పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు తాండూరి శ్రీమాన్ నారాయణ, కొమ్ము సుధాకర్ గార్లను అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుల ప్రజలు, పాల్గొన్నారు.

## కోతుల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు



**మానకొండూర్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో కోతుల బెడద రోజురోజుకి పెరుగుతూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామపంచాయతీ మూల మలుపు వద్ద వందల సంఖ్యలో కోతులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులు, పాదాచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రైతులు, కూలీలు రోజువారీ పనులకు వెళ్లేటప్పుడు భయంతో వెళ్తున్నారని, చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లడానికే జంకుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని, కోతుల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్



**పాలకుర్తి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంజపూరి నవీన్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఇంజపూరి నవీన్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై పార్టీలో చేరానని తెలిపారు. రాబోయే రోజుల్లో రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తంగేడ అనిల్ కుమార్, కన్నాల సర్పంచ్ మల్క రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి - సీఐటీయూ



**అమ్రాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మికులు పిలుపునిచ్చారు. పదరా ఎంపీడీవో సుధాకర్‌కు సమ్మె నోటీసు అందజేసిన సందర్భంగా తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. మల్లేష్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా 10 లక్షలు, మట్టి ఖర్చులకు 50,000 అందించాలని కోరారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమ్రాబాద్ మండల అధ్యక్షుడు ఎండి ఇసాక్, పదర గ్రామపంచాయతీ కార్మికులు సైదులు, బరపటి మల్లేశం, జక్కా సైదులు, మల్లయ్య, డి. కృష్ణవేణి, విజయ రాణి, ఎల్లమ్మ, అంజమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలపై భయం వీడి విజయాన్ని సాధించండి

**బుర్ర మధుసూదన్ రెడ్డి**




**కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పరీక్షల పట్ల భయాన్ని వదిలి, ఒత్తిడిని తగ్గించుకొని క్రమబద్ధమైన అభ్యాసంతో మంచి మార్కులు సాధించాలని ఎస్.ఆర్.ఆర్. కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రవరం, అనుపురం 10వ తరగతి విద్యార్థులకు ఆయన మోటివేషన్ క్లాసులు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాత్విక ఆహారం తీసుకోవడం, మంచి అలవాట్లు అలవరచుకోవడం, కఠినమైన విషయాలను చర్చిస్తూ అభ్యాసం చేయడం, కాలాన్ని సబ్జెక్టుల వారీగా విభజించుకొని చదవడం ద్వారా విద్యార్థులు ప్రగతి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో రుద్రవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత, అనుపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. విట్టల్, అనుపురం సర్పంచ్ చెర్ల రాజేశ్వరి మల్లేశం పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఎల్‌సిఎఫ్ కోఆర్డినేటర్ మాను వాడ శంకర్ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మల్లేశం మాట్లాడుతూ, విద్యార్థులకు చక్కటి మార్గదర్శకత్వం అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, సూచనలు పాటించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



**తార్నాక, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వ్యవసాయ కమిషన్ సభ్యులు భూమి సునీల్ తండ్రి మేక సంజీవ రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని, ప్రతి యేటా ఒక రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ములుగు జిల్లా దేవగిరి పట్నం గ్రామానికి చెందిన గిరిజన కౌలు రైతు నాగవత రాజు కుటుంబానికి తెలంగాణ వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేతుల మీదుగా రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. తార్నాకలోని లీఫ్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి, రాములు నాయక్, గోపాల్ రెడ్డి అదనంగా రూ.15 వేల సాయం ప్రకటించారు. కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పిల్లల చదువుకు అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. నాగవత రాజు (40) 8 ఎకరాల భూమిని కౌలు తీసుకుని పత్తి, వరి సాగు చేశాడు. వరుసగా మూడు సంవత్సరాలు పంట నష్టంతో రూ.5 లక్షల అప్పులు చేసి, 2020 జనవరి 23న పురుగుల మందు తాగి మృతి చెందాడు. భార్య లావణ్య కూలి పనులు, కుట్టు మిషన్‌తో కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్ద కుమార్తె తేజశ్రీ మానసిక వికలాంగురాలు కాగా, చిన్న కుమార్తె అంజలి, కుమారుడు జస్వంత ఆర్ధ ఉన్నారు.

## పురపాలిక ఎన్నికలకై పకడ్బందీ ఏర్పాట్లు

**- ఐ. రాణి కుముదిని**




**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని పురపాలిక ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులన ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఆమె, పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం--2లను సిద్ధం చేసి ముందుగానే సంసిద్ధం కావాలని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, గోదావరిఖని ఏసీపీ రమేష్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సేవకుడిగా పని చేస్తా.. ప్రగతికి బాటలు వేస్తా



**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
మున్సిపల్ కౌన్సిలర్ గా తనను గెలిపిస్తే 12వ వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతనని కాంగ్రెస్ అభ్యర్థి అప్పం శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ తోనే ఆమనగలు మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యం అని అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు శాంతినగర్ కాలనీలో గురువారం అప్పం శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన సతీమణి శ్రీలత, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఒక్కసారి అవకాశం ఇస్తే నిజమైన అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపుతానన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాజు, శ్రీను, అమీర్ రవి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ లో డీసీపీ తనిఖీ




**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ను గురువారం మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీబీ జానకీ రెడ్డి పరిశీలించారు. స్టేషన్ పనితీరు, రౌడీ షీట్లపై నిఘా, రికార్డులు భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. సిబ్బందికి ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పటిష్టంగా కొనసాగించేలా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్సై వెంకటేష్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# జడ్ పి.హెచ్.ఎస్ విద్యార్థులకు ఉచిత క్రీడా దుస్తుల పంపిణీ



**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మండలం మూలసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో జి. శారద మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కమల ఫౌండేషన్ అధ్యక్షుడు, పాఠశాల ఆంగ్లోపాధ్యాయుడు సాదుల వెంకటేశ్వర్లు విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనానికి నిత్యావసర సరుకులు, వంద శాతం హాజరున్న పిల్లలకు బహుమతులు సమకూర్చగా, వాటిని డీఈవో శారద, ఏఎంవో డాక్టర్ పి.ఎం. షేక్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రతినెల నూరు శాతం హాజరు కలిగిన విద్యార్థులకు కానుకలు, మధ్యాహ్న భోజనానికి నిత్యావసర వస్తువులు, స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందించి ప్రభుత్వ పాఠశాల ప్రగతికి తోడ్పడుతున్నందుకు కమల ఫౌండేషన్ అధ్యక్షుడిని డీఈవో అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్దార్ అబ్దుల్ హైజావీద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దెబ్బట రాములు, కూకట్ల తిరుపతి, లోకిని సదానందం, అంకతి సంజీవ్, మానుపాటి రాజయ్య, బాదం జ్యోతి, గర్రెపల్లి రమ, జూపాక రజిత, కాంపెల్లి కొమురయ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



**హుస్నాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కలిసి హుస్నాబాద్‌లోని గోమాత జిన్నింగ్ మరియు ప్రెస్సింగ్ కాటన్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులు సేకరించిన పత్తిని మిల్లులో శుభ్రపరచి గింజలను వేరు చేసి, యంత్రాల ద్వారా ప్రెస్సింగ్ చేసి 150--200 కిలోల బరువున్న కట్టలుగా (బేల్స్) తయారు చేసి స్పిన్నింగ్, ట్రేడ్డింగ్ మిల్లులకు పంపే విధానాన్ని తెలుసుకున్నారు. మిగిలిన పత్తి గింజలను నూనె మిల్లులకు పంపడం, నాసిరకం పత్తిని పరుపుల తయారీలో వినియోగించడం, సన్నని మెత్తని పత్తిని ప్రత్యేకంగా ప్యాక్ చేసి సిగరెట్ ఫిల్టర్లలో ఉపయోగించడం వంటి అంశాలను యాజమాన్యం వివరించింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ, ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించడంలో కీలకమని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు (బాటనీ), డాక్టర్ అనిల్ కుమార్ (జువాలజీ), డాక్టర్ ఇందిరా నాయనా దేవి (ఎకనామిక్స్), రాజ్యలక్ష్మి (ఫిజిక్స్), లక్ష్మి (గణితశాస్త్రం)తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ను ప్రారంభించిన పురపాలక సంఘ కమిషనర్




**హుస్నాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రెండవ విడత మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పురపాలక సంఘ కమిషనర్ టీ. మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు ఈ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**మ్రాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**





ప్రభుత్వ పాఠశాలలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. లింగాల మండలం హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ కార్యక్రమం, నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచర్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలని, జీవో నెంబర్ 42ను కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బల్మూరు పట్టణంలోని హైస్కూల్ కిచెన్ రూమ్ పూర్తిగా కూలిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగాల మండల ఏఐఎస్ఎఫ్ కమిటీగా మీనాక్షి వర్షిత్ (అధ్యక్ష కార్యదర్శి), విగ్నేష్ (సహాయ కార్యదర్శి), మాధవి (ఉపాధ్యక్షురాలు), వెంకటేష్ (కోశాధికారి)తో పాటు పదిమంది సభ్యులు ఎన్నుకోబడ్డారు. బల్మూరు మండల కమిటీలో వసంత, భాను ప్రసాద్ (అధ్యక్ష కార్యదర్శులు), సురేష్ (ఉపాధ్యక్షుడు), శ్రీజ (సహాయ కార్యదర్శి), శృతి (కోశాధికారురాలు)తో పాటు పదిమంది సభ్యులు ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ నాయకులు మధు, ఆంజనేయులు, సురేష్, వాసు, శివ, బాలమణి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమమే

# తెలంగాణ జాగృతి లక్ష్యం

**- బీ.శ్రీనివాస్ గౌడ్**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన ఉద్యమకారుల సమగ్ర సంక్షేమం, సామాజిక భద్రత, ఆర్థిక స్వావలంబనకే తెలంగాణ జాగృతి ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి, సబ్బండ వర్గాల వికాసం, సామాజిక తెలంగాణ సాధన అనే మహత్తర లక్ష్యాలతో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా 50 అధ్యయన కమిటీలను ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమ రంగంపై అధ్యయన కమిటీ బాధ్యత తనకు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. కవితక్క స్వయంగా జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించి, వారి అనుభవాలు, సమస్యలు, సూచనలను లోతుగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా విధానపరమైన సూచనలతో సమగ్ర బ్లూ ప్రింట్ రూపొందించారని ఆయన వివరించారు. ఇప్పటికే పలు కమిటీలు నివేదికలు సమర్పించగా, మిగిలిన కమిటీలు త్వరలో నివేదికలు అందజేయనున్నాయని చెప్పారు. ఒక్కో కమిటీలో ముగ్గురు--నలుగురు సభ్యులు, ఆయా రంగాల నిపుణులు, క్షేత్రస్థాయి అనుభవం కలిగిన వ్యక్తుల సహకారంతో అధ్యయనం జరిపి నివేదికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సాధికారతకు స్పష్టమైన రూట్ మ్యాప్ రూపొందించేందుకు కవితక్క ముందడుగు వేస్తున్నారని, ముఖ్యంగా ఉద్యమకారుల భవిష్యత్ భద్రతకు బలమైన విధానాలు రూపుదిద్దుకుంటున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు రూప్ సింగ్, రవిచంద్ర, వరలక్ష్మి, నవీనాచారి, అలాగే ఉద్యమకారుల అధ్యయన కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

# భయపెట్టే రాజకీయ సంప్రదాయాన్ని ప్రోత్సహించవద్దు

**దాసరి మనోహర్‌రెడ్డి**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలను బెదిరించి ఓట్లు పొందడం సరైన పద్ధతి కాదని, చేసిన అభివృద్ధి పనులను వివరించి ఓటు అభ్యర్థించాలన్నారు. భయపెట్టే రాజకీయ సంప్రదాయాన్ని ప్రోత్సహించవద్దని, అలాంటి వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పట్టణవాసులను కోరారు. గురువారం 11వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి పూదరి లతచంద్రశేఖర్ గెలుపు కోసం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతరెడ్డితో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నేతలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరగా, వారికి దాసరి మనోహర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ అభివృద్ధి పనులు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతరెడ్డి మాట్లాడుతూ, ప్రజల హక్కులను కాలరాస్తూ ఇండ్లలోకి వెళ్లి బలవంతంగా కండువాలు కప్పుతున్నారని మండిపడ్డారు. 11వ వార్డు అభ్యర్థి పూదరి లతచంద్రశేఖర్‌ను తీవ్ర బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఈ పరిస్థితి పెద్దపల్లిలో రాజ్యాంగం అమలులో లేదనిపిస్తోందని అన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని రూ.200 కోట్లతో అభివృద్ధి చేశామని, తమ పనులకు కాంగ్రెస్ నేతలు శిలాఫలకాలు వేస్తున్నారని విమర్శించారు. హుందాగా రాజకీయాలు చేశామని, నీచ రాజకీయాలకు తావు ఇవ్వలేదని స్పష్టం చేశారు. నేర చరిత్ర లేని, చదువుకున్న పూదరి లతచంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు.

# అభివృద్దే ప్రధాన లక్ష్యం - తల్లోజు గీత

**ఆమనగల్లు, ఫిబ్రవరి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**



ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి తల్లోజు గీతమ్మ వార్డులో ఇంటింటా తిరుగుతూ తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సంకల్పంతో వార్డు అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా నిజాయితీతో ప్రజాసేవ చేయాలని ఆశయంతో తాను ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. ప్రజలతో మమేకమై నేరుగా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా పనిచేస్తానని చెప్పారు. మూడవ వార్డులో మౌలిక వసతుల వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి మూడవ వార్డును ఆదర్శ వాడుగా తీర్చి దిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంతు నాయక్,శ్రీను నాయక్, శీను నాయక్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

**ఎమ్మెల్యే - కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కడ్తాల్, ఫిబ్రవరి 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారధ్యంలో యువతకు క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు మరియు క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ప్రతిష్మాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నీలో భాగంగా కడ్తాల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి టోర్నీ వివిధ పోటీల కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి మరియు నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత అభివృద్ధికి, క్రీడలకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల యువత తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటుకునే వేదిక లభిస్తుందని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, ప్రతి యువకుడు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని, ఓటంతో కృంగిపోవద్దని సూచించారు. అపజయాలనుండి పాటాలను నేర్చుకొని విజయానికి కృషి చేయాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పై జోనల్ స్థాయి వరకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ నియోజకవర్గ స్థాయి పోటీలలో గెలిచి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేబీటి సర్పంచ్ బిక్కు నాయక్, వార్డ్ సభ్యులు రాఘవేందర్, భానుకిరణ్, కరోళ్ళ రమేష్, అధికారులు ఎంపీడీవో సుజాత, పట్టణ సెక్రెటరీ అల్లాజీ, కడ్తాల్ ఎంఈవో నిర్మల అలాగే తలకొండపల్లి, ఆమనగల్ మరియు మాడుగుల ఎంఈవోలు పాండు, చంప్లా, సర్దార్ మరియు ఇంచార్జ్ భీమ్, ప్రధానోపాధ్యాయులు జంగయ్య, పిటి ఉపాధ్యాయులు మరియు నాయకులు లక్ష్మయ్య, జహంగీర్ అలీ, చందోజి, క్యామ రాజేష్, షాబుద్దీన్, లక్ష్మీనారాయణ, ఎర్రోళ్ల శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, మహేష్, శ్రీను, లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎస్ పదోన్నతి పొందిన ఏనుగు నరసింహారెడ్డికి ఘన సన్మానం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్ పదోన్నతి పొందిన సందర్భంగా రవీంద్రభారతి కళాభవన్‌లో ఘన సన్మానం జరిగింది. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్, సినీ హీరో జైహింద్ గౌడ్ కలిసి శాలువా కప్పి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగర మాజీ సర్పంచ్ మంచాల వెంకటస్వామి, ప్రముఖ గాయని పంజాల రాజకుమారి, మల్లేష్ గౌడ్, బైరి చంద్రశేఖర్, కె. లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు దూరమవుతున్న గ్రామీణ విద్యార్థులు



**మానకొండూర్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య అందని ద్రాక్షలుగా మారుతోంది. పట్టుదలతో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ చదువుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేట లేదా కరీంనగర్ వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణ సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది చదువును కొనసాగించలేక మధ్యలోనే ఆగిపోతున్నారు. స్థానికులు మాట్లాడుతూ, బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా ఉంటారని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి



**కడ్తాల్, ఫిబ్రవరి 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ సహకార సంఘం విజయ డైరీ పాడి రైతులకు ఒక నెల 15 రోజుల పాల బిల్లు ఇవ్వకుండా పాడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని, ప్రభుత్వం పాల బిల్లులు ఎందుకు ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు అడగ చైర్మన్ గుప్తా అమిత్ రెడ్డి విజయ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వ సంస్థలకు ఇచ్చిన పాలు పాల పదార్థాలు ప్రభుత్వం నుండి సుమారు 60 కోట్లు పైచిలుకు రావాలి, కాబట్టే మేము ఇల్లులు ఇవ్వలేకపోతున్నాము స్పష్టం చేయడం జరిగింది. దీంతో కడ్తాల్ పాలసితలికరణ కేంద్రం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి విజయ పాలబకాయలను వెంటనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో లీటర్ కి ఐదు రూపాయల ప్రోత్సాహాన్ని ఇస్తానని ఇంతవరకు ఇచ్చిన పాపాన పోలేదు కావున ప్రభుత్వ పెద్దలు నాయకులు గ్రహించాలి విజయ కార్పొరేషన్కు మొత్తం పాలు మూడు లక్షల సేకరణ జరుగుతుంది అందులో ఉమ్మడి మహబూబ్నగర్ నుండి రెండు లక్షల లీటర్లు ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టితో విజయ డైరీ అభివృద్ధిని చెందాలి కావున పై విషయాలపై తక్షణమే ప్రభుత్వం స్పందించి బకాయిలను చెల్లించి మార్కెట్ కు అనుగుణంగా రేట్లు పెంచాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు మరియు అధ్యక్షులు కడారి రామకృష్ణ, రంగయ్య, శ్రీకాంత్ రెడ్డి,జంగయ్య, ప్రవీణ్, ఎలమందరెడ్డి,జితేందర్ రెడ్డి, రంగ నాయక్,మల్లేష్,హరి నాయక్, రమేష్ నాయక్, మల్లేష్, రాజు,శ్రీనివాస్ రెడ్డి, కోటి,గోపి,నరసింహ, నరసింహారెడ్డి,జంబుల అభిషేక రెడ్డి పాల్గొన్నారు.

# భూమి పట్టా లేని రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్




**హుస్నాబాద్ , ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టా పాస్‌బుక్ లేని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే యూరియా కొరతతో అల్లాడుతున్న రైతులకు యూరియా యాప్ మరో తలనొప్పిగా మారిందని ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పట్టా పుస్తకాలు లేకుండా వ్యవసాయం చేస్తున్న రైతులను దృష్టిలో పెట్టుకోకుండా యూరియా పంపిణీలో నిబంధనలు విధించడం అన్యాయమని అన్నారు. యూరియా యాప్‌లో నమోదు సమస్యలు, సాంకేతిక లోపాల కారణంగా రైతులు గంటల తరబడి సహకార కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పట్టా ఉన్నా లేకపోయినా పంటలు పండించే ప్రతి రైతుకూ ఎలాంటి అడ్డంకులు లేకుండా యూరియా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు నమోదు చేసి, పాస్‌బుక్ లేని రైతులకు కూడా యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పంట వేసే సమయంలో ఎరువులు అందకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ స్పష్టం చేశారు.

# మహిళా శక్తే కాంగ్రెస్ బలం

**-14వ వార్డులో శారదా బ్రహ్మం ప్రభంజనం**
**-మాటలకే పరిమితమైన విపక్షాలకు ప్రజల నుంచి తిరస్కారం**





**వనపర్తి ఫిబ్రవరి 05(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శారదా బ్రహ్మం ప్రచారం ఊపందుకుంది. బ్రహ్మంగారి గుడి ప్రాంతంలో ఆమె చేపట్టిన ప్రచారానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. “మహిళల భద్రత, గౌరవం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం” అన్న నినాదం ప్రచారంలో ప్రతిధ్వనించింది. ఇల్లు ఇళ్లు తిరుగుతూ శారదా బ్రహ్మం మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో తమ భర్త చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేశారు. అధికారంలో లేకున్నా ప్రాంత అభివృద్ధిని విస్మరించని చరిత్ర కాంగ్రెస్‌కే దక్కిందని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కనిపించే విపక్ష నాయకులు, ప్రజల సమస్యలను పట్టించుకోని వారి ద్వంద్వ వైఖరిని ఆమె తీవ్రంగా ఎండగట్టారు. తాను కౌన్సిలర్‌గా గెలిస్తే మహిళలకు భద్రత కల్పించేలా వీధిలైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని, పింఛన్దారులు, వితంతువులు, వికలాంగులకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందిస్తానని, ప్రతి మహిళా సమస్యకు వెంటనే స్పందించే వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానని, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రత, రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. “అభివృద్ధి అంటే మాటలు కాదు... పని కావాలి. ప్రజలను మోసం చేసిన విపక్షాలకు ఈ ఎన్నికల్లో మహిళలే గట్టి బుద్ధి చెబుతారు” అని శారదా బ్రహ్మం స్పష్టం చేశారు. ఈ ప్రచారంలో వార్డు పవన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మచారి సహా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. 14వ వార్డులో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం స్పష్టంగా కనిపిస్తోందని, వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కెల్లా భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# అందుబాటులో ఉంటా.. ప్రజా సమస్యలు తీరుస్తా

**- 15వ వార్డు బిజెపి అభ్యర్థి కండె సీతారాములమ్మ**



**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానని ఆ అమ్మాయిని మున్సిపాలిటీ 15వ వార్డు బిజెపి అభ్యర్థి కండె సీతారాములమ్మ పేర్కొన్నారు. గురువారం 15వ వార్డులోని పలు కాలనీలో కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి బిజెపి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి కండె సీతారాములమ్మ గెలిపించాలని కోరారు. బిజెపితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమన్నారు. అవకాశవాదుల మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కండె భాస్కర్,కండె సుమన్,లక్ష్మణ్, రాజు, గిరి, కృష్ణయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమనగల్ మున్సిపాలిటీలో ఒకరికొకరు ఎదురుపడగా... రాజకీయ వేడిని పక్కకి పెట్టి ఆప్యాయంగా పలకరించుకుంటున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,బిజెపి నాయకులు తల్లోజు ఆచారి.

# మేడి పాపన్న ఎమ్మార్పీఎస్ మండల కమిటీలు ఏర్పాటు



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడి పాపన్న ఎమ్మార్పీఎస్ మండల కమిటీలు గురువారం ఏర్పాటు అయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు కలకొండ యాదయ్య, కల్వకుర్తి తాలూకా ఇంచార్జ్ కసిపాకుల రవికుమార్ పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో కల్లకుర్తి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఆకుతోటపల్లి పులిజాల శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కలకొండ యాదయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని 59 కులాలకు ఇప్పటి వరకు ఎలాంటి కార్పొరేషన్ లోన్లు, ప్రభుత్వ నిధులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిలను మభ్యపెట్టి అధికారం చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి సిగ్గు తెచ్చుకోవాలని ఆయన విమర్శించారు. కసిపాకుల రవికుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు చేస్తున్న అన్యాయం ఇంకా కొనసాగుతూనే ఉందని, ఎస్సీ కార్పొరేషన్ లోన్లు రెండున్నర సంవత్సరాలైనా రాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని నిధులు విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కంబాలపల్లి కుమార్, కిరణ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యోదంతంతో షాద్‌నగర్‌లో విధుల బహిష్కరణ



**షాద్‌నగర్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామంలో మహిళా న్యాయవాది స్వప్నను అతి దారుణంగా హతమార్చడం హేయనీయమని షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి గుండుబాయి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పట్టణ కోర్టు ఆవరణలో స్వప్న చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబానికి ఆ దైవం మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ "అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి" అంటూ నినాదాలు చేశారు. తరువాత న్యాయవాదుల బృందం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేసి, న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు.

**సమస్యను అసెంబ్లీలో చర్చిస్తా – ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తారని, వారిపై దాడులు, హత్యలు జరగడం అత్యంత హేయనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. న్యాయవాదుల విన్నపం సరైనదని, దీనిపై అసెంబ్లీ సెషన్‌లో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అనంతరం న్యాయవాదులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులందరూ ఆందోళనలో పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీ నుంచి ఐదుగురు సస్పెండ్

**నల్లగొండ ,ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నందున బొజ్జ సైదులు (4వ డివిజన్), బీపంగి కిరణ్ (14 వ డివిజన్), కొంగర సైదులు (19 డివిజన్), చిలువేరు నాగరాజు (35 డివిజన్), వీరమళ్ళ భాస్కర్ (37 డివిజన్)ను బిఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ నల్గొండ నగర అధ్యక్షులు బోనగిరి దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి వీరికి బిఆర్ఎస్ పార్టీతో ఎటువంటి సంబంధం ఉండబోదని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనేది

**-ప్రభుత్వ పాఠశాలలు అంటే చిన్న చూపేలా.**
**-ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి**
**-ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్.**



**లింగాల ఫిబ్రవరి 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన కోరబడిందని ప్రభుత్వ పాఠశాలలంటే అధికారుల సైతం చిన్నచూపు చూస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిలభారతి విద్యార్థి ఫెడరేషన్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్ కుమార్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో లింగాల మండలం హైస్కూల్లో సభ్యత్ కార్యక్రమం నూతన కమిటీ ఎన్నిక . ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులో నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి,
ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తులు ను నేటికీ అందించలేదని దీన్నిబట్టి ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ఎంత ప్రేమ చూపిస్తుందో అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు . కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు లో అధిక పీజుల ను అరికట్టాలి.
జీవో నెంబర్ 42ను పట్టిష్టంగా అమలు చేయాలినీ వారన్నారు కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లాలో ఉన్న ప్రభుత్వ అధికారులు సోద్యం చూస్తున్నారు తప్ప



అధిక ఫీజులు తీసుకుంటున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ,ప్రభుత్వ అధికారులు వైఫల్యంచెందారని ఆయన అన్నారు . ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు వారి ఇష్టానుసారంగా పీజులు పెంచాయని, ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి ఫీజుల నియంత్రణ కు కఠిన చట్టాలు తేవాలి, ఫీజుల నియంత్రణ కమిటీ ని ఏర్పాటు చేయాలని అన్నారు అదేవిధంగా, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి విద్యార్థులకు సరైన ప్రత్యామ్నాయం చూపించాలని ఆయన పేర్కొన్నారు. బల్మూరు పట్టణంలో ఉన్న హై స్కూల్ కిచెన్ రూమ్ పూర్తిగా కూలిపోవడం ఇక్కడ ఉన్న ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు అందరూ కలిసి విద్య అధికారులు మరియు రాజకీయ నాయకులకు సమస్యని వివరించిన వారు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ఆరోపించారు, అనంతరం లింగాల మరియు బల్మూర్ మండలాల ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఎన్నుకోవడం జరిగింది లింగాల మండల్ ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులుగా మీనాక్షి వర్షిత్, సహాయ కార్యదర్శిగా విగ్నేష్, ఉపాధ్యక్షులుగా మాధవి, కోశాధికారిగా వెంకటేష్ మండలం సమితి సభ్యులుగా పదిమంది ఎన్నుకోవడం జరిగింది, బల్మూరు మండలం సమితి అధ్యక్ష కార్యదర్శులు వసంత, భాను ప్రసాద్ ఉపాధ్యక్షులుగా సురేష్, సహాయ కార్యదర్శిలుగా శ్రీజ, కోశాధికారురాలు శృతి, మండల సమితి సభ్యులుగా పదిమందికి ఎన్నుకోవడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అచ్చంపేట నియోజకవర్గం మధు, ఆంజనేయులు సురేషు వాసు శివ బాలమణి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక

# సమ్మె కు కార్మిక వర్గం సిద్ధం కావాలి

**నిడమానూరు ఫిబ్రవరి 05. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం ప్రజల సిద్ధం కావాలని కేవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, సిఐటియు మండల కన్వీనర్ కోమాండ్ల గుర్వయ్య పిలుపునిచ్చారు. గురువారం నిడమనూరు మండల కేంద్రంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రం ఆవిష్కరించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను వేగంగా అమలు చేస్తుందని విమర్శించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం రైతాంగం పెద్ద ఎత్తున పోరాడుతుందని అన్నారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 12న,10 కేంద్ర కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఫెడరేషన్లు రాష్ట్ర ప్రభుత్వ



ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారని అన్నారు. ఈ సమ్మె నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని అన్నారు. కార్మిక వర్గం వందేళ్ళ క్రితం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక హక్కులను కాలరాచారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను లూటీ చేస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టడం కోసం ఈ పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ సమ్మె జయప్రదం కోసం అన్ని యూనియన్ జనరల్ బాడీ సమావేశాలు సమ్మె నోటీసులు బైక్ ర్యాలీలు సభలు సమావేశాలు విస్తృతంగా నిర్వహించి కార్మిక వర్గంలోకి వెళ్లాలని కోరారు. 140 కోట్ల మంది ప్రజల ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కుంచెం శేఖర్, ఎస్ ఎఫ్ ఐజిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్,సిఐటియు నాయకులు కోదండ చరణరాజ్, ముత్యాల కేశవులు, బొడ్డు లింగయ్య, వింజమూరి శివ, గుత్తా శ్రీనివాస్ రెడ్డి,యాదయ్య, నరసింహ, విష్ణు,శ్యామల రాజేష్, వేణు, గణపతి వెంకటయ్య, సైదులు, శ్రీను, శంకర్, ఆవుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి -అభివృద్ధి చేసి చూపిస్తా

**-షాద్‌నగర్ 27వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మురళీమోహన్ (అప్పి)**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో 27వ వార్డులో ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మురళీమోహన్ (అప్పి) గురువారం వార్డు పెద్దలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు తనను ఆశీర్వదించి మున్సిపల్ కౌన్సిల్‌కు పంపితే వార్డును పట్టణంలో అన్ని వార్డుల కన్నా సర్వాంగసుందరంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో



చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయుధంగా ప్రజల ముందుకు వచ్చానని, మరో అవకాశం ఇస్తే తప్పనిసరిగా అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా మాజీ కౌన్సిలర్ కృష్ణవేణి, డాక్టర్ దిలీప్ దంపతులను కలుసుకొని వారికి ఓటు వేయాలని అభ్యర్థించారు. వార్డులో అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతుండగా, ప్రజల నుండి విశేష స్పందన లభిస్తున్నదని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు తనకు ఉందని, ప్రజలు అవకాశం ఇస్తే నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని మురళీమోహన్ (అప్పి) హామీ ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొన్నారు.

## నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ షో





**నల్లగొండ ,ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ పట్టణంలో నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ షోకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు..పానగల్లు మీదుగా కొనసాగిన రోడ్ షోకు విశేష ప్రజాదరణ లభించింది..1 వ డివిజన్ ఆలకుంట్ల నాగరాజు,2 వ డివిజన్ గురిజాల నరేందర్,3 వ డివిజన్ గాలి వినోద్ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి పాల్గొన్నారు. పానగల్లు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిలిపిందన్నారు..ఈ ఎన్నికలు పేద ప్రజలకు మేలు చేసే ఎన్నికలని చెప్పారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు,చీరలు అందిస్తున్నామని,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు.. ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున అర్హులైన ప్రతి పేదవారికి సొంతిల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 48 కి 48 డివిజన్లలో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని అడిగి నల్లగొండకు ఎక్కువ నిధులు తెస్తానని అన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## వ్యవసాయ యంత్రాల పంపిణీ

**-మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి**



**నల్లగొండ, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన యంత్రాలను మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు సబ్సిడీ యంత్రాలు అందాయని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతాంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అర్హులైన ప్రతి రైతుకు యంత్రాలు అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.నల్లగొండను కార్పొరేషన్‌గా మార్చిన మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటప్రకారం, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మనోహరాబాద్‌లో కుష్టు వ్యాధిపై అవగాహన



**మెదక్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామ మహిళా సమైక్య భవనంలో స్పార్క్ లెప్రసీ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ, కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఇది ప్రధానంగా చర్మం, నరాలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. యం.డి.టి. బహుళ ఔషధ చికిత్సతో 6--12 నెలల్లో పూర్తిగా నయం అవుతుందని, ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని వివరించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, సిహెచ్ఓ బాల నర్సయ్య, డిపియంఓ సంతోష్ కుమార్, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో భూభారతి కేసుల పరిష్కారం



**నల్గొండ, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భూభారతి కేసుల పరిష్కారంలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గురువారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం శివారులోని ప్రభుత్వ భూములను పరిశీలించారు.మండలంలోని ప్రభుత్వ, సీలింగ్ భూములపై తహసిల్దార్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంతోపాటు, అసైన్డ్ భూముల్లో సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరించాలని ఆదేశించారు.దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించేందుకు తహసిల్దార్లు చొరవ చూపాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా యూరియా పంపిణీ రైతులకు సులభతరం



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ యూరియా యాప్ ద్వారా రైతులు ఇంట్లో కూర్చున్న చోటు నుండే యూరియాను పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులు ఇకపై గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.కొత్తగూడెం శివారులో రైతులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, యూరియా అందుబాటులో సమస్యలు లేకుండా గుర్తించిన డీలర్ల వద్ద స్టాక్ ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా లక్ష 46 వేల మంది రైతులు ఆరు లక్షల 1137 బ్యాగుల యూరియాను కొనుగోలు చేసినట్లు వివరించారు.రైతులు ఓటిపి నమోదు సమస్యలపై ఆవేదన వ్యక్తం చేయగా, కలెక్టర్ యాప్ వినియోగంపై అవగాహన పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ తహసిల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులకు ఘన సన్మానం



**వంగూరు, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తాసిల్దార్ మురళీమోహన్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శేఖర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, రైతుల భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అంకితభావంతో పనిచేస్తున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ధరావత్ సంతోష్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఈ ఇద్దరు అధికారులను నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది. శాలువా కప్పి, సత్కారం చేసి అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బండపల్లి శ్రీనయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ కొండల్, జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ బాలు, జిల్లా కన్వీనర్ శేఖర్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ అభివృద్ధి కేసీఆర్ పాలనలోనే సాధ్యమైంది

**-- హరీష్‌రావు**



**సిద్దిపేట, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్, గజ్వేల్ పట్టణంలో గురువారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ రూపురేఖలు మారాయని, 250 పడకల ఆసుపత్రి, ఆర్డీవో కార్యాలయం, రైలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, చెరువుల సుందరీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.కాంగ్రెస్, బీజేపీ ప్రజల కోసం ఒక్క రూపాయి పని చేయలేదని విమర్శిస్తూ, మైనార్టీల విద్య కోసం రెసిడెన్షియల్ స్కూల్స్, పేదల పెళ్లిళ్లకు షాదీ ముబారక్ వంటి పథకాలు కేసీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు ఒక్క రూపాయి సాయం జరగలేదని ఆయన దుయ్యబట్టారు."మన తెలంగాణను కాపాడుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలి. గజ్వేల్ గౌరవం నిలబడాలంటే బీఆర్ఎస్ గెలవాలి" అని హరీష్‌రావు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత అనే వాక్యంపై వివాదం



**అమ్రాబాద్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ సారే తెలంగాణ జాతిపిత అని, ఆయన స్థానంలో కేసీఆర్‌ను నిలబెట్టే ప్రయత్నం అవాస్తవమని టి-జేఏసీ అచ్చంపేట రాష్ట్ర నేత శ్రీనివాస్ స్పష్టం చేశారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముల్కీ--నాన్ ముల్కీ ఉద్యమం, 610 జీవో, తొలి--మలి దశల్లో ప్రజలను నడిపించిన గొప్ప తెలంగాణ వాది ప్రొఫెసర్.జయశంకర్ నిజమైన జాతిపిత అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేసీఆర్‌ను జాతిపితగా పిలవాలని చేస్తున్న డిమాండ్ హాస్యాస్పదమని, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు దీనిని ఖండించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు తెలంగాణ అవగాహన సోయి లేని రోజుల్లో ప్రొఫెసర్.జయశంకర్ స్పష్టమైన వైఖరితో పోరాటం చేశారని, అలాంటి ఉద్యమ నాయకుల గుర్తులను చెరిపివేయడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి- జేఏసీ అచ్చంపేట చైర్మన్ కాశన్న యాదవ్, బీసీ యాదవ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టి- జేఏసీ సోషల్ మీడియా ఇన్చార్జి మహబాబ్ అలీ, రామ్ రహీం ఆటో యూనియన్ అధ్యక్షుడు, పోలే రవికుమార్, మహేంద్రనాథ్ యవజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ఐక్య ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం 18వ వార్షికోత్సవం



**కరీంనగర్, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కిసాన్ నగర్‌లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం 18వ వార్షికోత్సవ దినోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వాసాలమర్రి మహేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 108 కలశాలతో పాటు 108 దంపతులచే మహా కుంభాభిషేకం నిర్వహించబడింది. అనంతరం స్వామివారి అలంకరణ, లక్ష్మీ గణపతి హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు.తరువాత మంగళహారతి, తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.ఈ వేడుకలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ది చంద్రమౌళి, గంజి రఘు, ఎలుగూరి ప్రసాద్, దొంతుల మనోహర్, బడిమెల రామ్మోహన్, కైలాస హరీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

-- సర్పంచ్ రమాదేవి



**ఎలిగేడు, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్ సూచించారు.ర్యాకల్దేవుపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఏఎల్ఎంసీ స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిల్లల పోషణ, ఆరోగ్యం, మహిళ సంక్షేమం వంటి అంశాలపై చర్చించారు. అంగన్వాడీ సేవలను సమర్థవంతంగా అమలు చేయడంలో కమిటీ సమావేశాలు కీలకమని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, అంగన్వాడీ టీచర్ ఓదెశ్వరి, గర్భిణీలు, బాలింతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులలో కనీస సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి



**ఎలిగేడు, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అలోకిత్ వ్యవస్థాకులు, సీఈవో ప్రమోద్‌కుమార్, జిల్లా రిసోర్స్ పర్సన్ సమీర్ అహ్మద్ సూచించారు.ఎలిగేడు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం జరిగిన 5వ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులలో ఉండాల్సిన కీలక సామర్థ్యాలపై ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమీక్షా విధానం ప్రశంసనీయమని పేర్కొన్నారు.భోధన-అభ్యాసన ప్రక్రియలో విద్యార్థులు వెనుకబడిన అంశాలను శాస్త్రీయంగా గుర్తించి, భాషా, గణిత సామర్థ్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈఓ నరేంద్ర చారి, కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్‌రావు, పాఠశాల హెచ్ఎంలు, మండల రిసోర్స్ పర్సన్స్ యుగేందర్, పులి వెంకటరామిరెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రచారం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం గురువారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మున్సిపాలిటీ ఇన్‌చార్జి జూపల్లి భాస్కరరావు గడపగడపకు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కల్వకుర్తి మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో తాండ్ర గ్రామ మాజీ సర్పంచ్ సుశీల ఈశ్వర్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ పవన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య యాదవ్, వెల్దండ నాలుగో వార్డు సభ్యురాలు సునీత, జంగిలి ఆనంద్, భీమయ్య గౌడ్, రాజు, శ్రీను, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



ముప్పిరితోటలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామిడి శైలజ వెటర్నరీ వైద్యురాలు ఝాన్సీ.

## పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత



**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పురపాలక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను గురువారం మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, ఏసిపి జానకి రామ్ రెడ్డి పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లు భద్రత చర్యలను సమీక్షించి అధికారులకు తగు సూచనలు చేశారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జానకీ రాం రెడ్డి, ఎస్సై వెంకటేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న తల్లోజు ఆచారి






**ఆమనగల్లు, ఫిబ్రవరి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండ వద్ద నున్న శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వార్ల కళ్యాణ ఘట్టం ఆలయ పూజారి మల్లికార్జున్ ఆధ్వర్యంలో పూజలు కనులవిందుగా జరిగినాయి. ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి గీత ఈ స్వామివార్ల కళ్యాణానికి హాజరైనారు. ఆలయంలో మహిళలు భక్తులతో దేవాలయం ప్రాంగణం కిటకిట లాడాయి. దేవాలయాన్ని కాషాయపు జెండాలతో, పచ్చటి తోరణాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో, దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ రేగట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు, శివ స్వాములకు, ప్రతిరోజు అన్న ప్రసాదం జరుగుతుందని రేగటి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల కవిత, కృష్ణయ్య, నాగులపల్లి సుస్మిత, శ్రీకాంత్, మేస్త్రి జంగయ్య, జల్లెల్ల శ్రీశైలం ,లింగంపల్లి అశోక్ ,వాటర్ ప్లాంట్ మహేష్ ,యాదగిరి, పుర ప్రముఖులు శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు ఉదయ నగర్ కాలనీ ప్రతిభా నగర్ కాలనీ శివాలయం కాలనీ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి రేవతి గెలుపు కోసం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో తిరుగుతూ ఓటు వేయాలని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ఆమనగలు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేపట్టడానికి వీలుంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ ను నివాస గృహాల నుండి తొలగింప చేస్తామన్నారు. పుర ఎన్నికల్లో 15 వార్డులో కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కేశవులు, జక్కుఅనంత్ రెడ్డి, నిట్ట నారాయణ, మెకానిక్ బాబా, శేఖర్,కుమార్ గౌడ్, సురేష్, తోట శీను, భాస్కర్,రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గౌస్,ఆకాష్, శివ, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ విజయం తథ్యం

- గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ 2,3వ వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సువర్ణ దేవేందర్ నాయక్, రాములు నాయక్ గెలుపు కోసం గురువారం ఉదయం ఇంటింటి ప్రచారం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అభివృద్ధి కొనసాగాలంటే అనుభవం కలిగిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.ప్రచారంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు.

## కల్వకుర్తి 19వ వార్డులో కాంగ్రెస్ ప్రచారం




**కల్వకుర్తి, ఫిబ్రవరి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి మహ్మద్ సోఫీ గెలుపు కోసం గురువారం ఇంటింటి ప్రచారం జరిగింది.మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఎండి రషీద్, కాలనీ నాయకులు కలిసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశీర్వాదంతో సోఫీని గెలిపించి వార్డును అభివృద్ధి బాటలో నడిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మహిళా నాయకురాలు లక్ష్మీ రాంరెడ్డి, రెహనా, ఫజల్ బేగం, ఖయ్యాం, తయ్యుబ్, మాసూం, అలీమ్, జాకెర్, నర్సిమ్మతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధి ప్రధాన లక్ష్యం

- నేనావత్ సునీత



**ఆమనగల్లు, ఫిబ్రవరి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి సునీత నాయక్ వార్డులో ఇంటింటా తిరుగుతూ తమను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సంకల్పంతో వార్డు అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా, నిజాయితీతో ప్రజాసేవ చేయాలనే ఆశయంతో తాను ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. ప్రజలతో నేరుగా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా పనిచేస్తానని చెప్పారు. 11వ వార్డులో మౌలిక వసతుల వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి 11వ వార్డు ను ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ నాయక్, జంగయ్య, లక్ష్మయ్య,కృష్ణయ్య, గిరి యాదవ్,మల్లేష్ యాదవ్,కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు తొమ్మిదో వార్డు అభ్యర్థి మహేష్ ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్న తల్లోజు ఆచారి.